ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రానికి ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు వస్తున్నాయని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.
- ❖ బక్రీద్ సందర్భంగా ఆవులు, దూడలు వధించినా.. రవాణా చేసినా.. జంతు హింస నివారణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కె. అచ్చెన్నాయుడు హెచ్చరించారు.
- ❖ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ పాలన పన్నెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

==========================

రాష్ట్రానికి ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు వస్తున్నాయని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడుని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన చంద్రబాబు నాయుడు.. రాష్ట్రంలో మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళల విషయంలో తెలుగుదేశం పార్టీ సముచితమైన నిర్ణయాలను తీసుకుంటోందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు

దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ట్రాన్స్ కో జేఎండీ, డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, సీఈలు, క్షేత్రస్థాయి ఎస్ఈలు ఈ సమీక్షకు హాజరయ్యారు. అధిక వేడి, గాలి వానలతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లుగా  అధికారులు ఈ సందర్భంగా వివరించారు. విద్యుత్ అంతరాయాలపైన ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని మంత్రి ఆదేశించారు. 24 గంటలు 1912 కాల్ సెంటర్లు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం నిర్మాణంలో ఉన్న ట్రాన్స్ కో సబ్ స్టేషన్లను వేగంగా పూర్తి చేయాలని కోరారు. అదే విధంగా భవిష్యత్ అవసరాల కోసం సబ్ స్టేషన్లు, ఫీడర్ల సామర్థ్యం పెంచుతూ అప్ గ్రేడ్ చేయాలన్నారు.

==========================

గుంటూరు జిల్లా తెనాలి ఆటోనగర్ లోని కెమికల్ గోడౌన్ లో నిన్న సాయంత్రం జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... వెంటనే అంటుకుని మండే స్వభావం ఉన్న వస్తువులతో వ్యాపారాలు చేసేవారు ఎండాకాలంలో జాగ్రత్తగా ఉండకపోతే వారితో పాటు పక్కవారికి కూడా నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిల్వ పదార్థాలపై ప్రతీ ఇంటికీ ఆడిట్ చేస్తామని, ప్రతి వ్యాపారి అగ్నిమాపక అధికారి నుండి నిరభ్యంతర ధృవ పత్రం కలిగి ఉండాలని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వ పాలన పన్నెండేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... జూన్ 5 నుండి 21వ తేదీ వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఎన్డీయే పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వంటి విషయాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని.. అలాగే జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. `సబ్కా సాథ్.. సబ్కా వికాస్... సబ్కా విశ్వాస్.. సబ్కా ప్రయాస్` అనే నినాదంతో ఎన్డీయే పాలన సాగుతోందని చెప్పారు. 2047 నాటికి `వికసిత్ భారత్` నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాదిగా ఆయన పేర్కొన్నారు.

విరామం

==========================

రాష్ట్రంలో ఆవులు, దూడలు, ఒంటెలను వధించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసినా జంతు హింస నివారణ చట్టం, ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం, పశుసంరక్షణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వ్యవసాయ పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. బక్రీదు పండుగ సందర్భంగా జంతువుల వధ, రవాణా, సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ చట్టాలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల వధను రాష్ట్రంలో పూర్తిగా నిషేధించినట్లుగా మంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలోని పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని అనధికార పశువుల వధను అరికట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

==========================

ప్రధానమంత్రి విద్యాలక్ష్మీ పథకం మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజకరమని ఈ పథకాన్ని వినియోగించుకున్న కుటుంబం పేర్కొంది. కర్నూలు నగరంలోని కృష్ణానగర్ కాలనీకి చెందిన నిఖిల్ ఈ పథకం ఆసరాతో కడప జిల్లా రిమ్స్ కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసారని బంధువు మామ వీరప్ప తెలిపారు.

(వాయిస్ 19 సెకన్లు)

===========================

గోదావరి నదిలోకి చేరుతున్న మురుగు నీటి ప్రవాహాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేయాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పబ్లిక్ హెల్త్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా కలెక్టర్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ గోదావరి నది జలాల కాలుష్య నివారణ చర్యల కోసం 6 జిల్లాల పరిధిలో 100 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అత్యవసర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.

===========================

అగ్నిపథ్ పథకం 2027 నియామకాలకు గాను రెగ్యులర్ కేడర్‌లో భారత సైన్యంలో చేరడానికి నిర్వహించే ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్షను జూన్ 1 నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తారని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కల్నల్ రజత్ సువర్ణ ఈరోజు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. అనంతపురం, గుంటూరు, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలలో ఈ పరీక్ష జరుగుతుందని ఆయన చెప్పారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కల్నల్ రజత్ సువర్ణ తెలిపారు. అభ్యర్థులు తెలుగు, హిందీ ఇంగ్లీషుతో సహా 13 భాషలలో ఏదైనా ఒక భాషలో ఆన్‌లైన్ పరీక్ష రాయవచ్చని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను గుంటూరు, విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయాల్లో నిర్వహించే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో శారీరక పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం హాజరుకావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

===========================

పశ్చిమ మధ్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 7.6 కిలోమీటర్ల మధ్య తూర్పు మధ్య ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి వెల్లడించారు.

===========================
===========================